క్లుప్తంగా

పౌష్టికాహారంపై బాలింతలకు అవగాహన

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలంలోని అయ్యప్పగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పఖ్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు ఆఫీసర్ నిర్మల గర్భవతులు, బాలింతలు, తల్లుల సంరక్షణ, పౌష్టికాహారం, జంక్‌ఫుడ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సువార్త మహాసభలు ప్రారంభం



ఐరాల క్రాస్‌లోని జీఎఫ్ఐ చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ మార్టిన్ స్టీఫెన్

తవణంపల్లె: మండలంలోని ఐరాల క్రాస్‌లోని జీఎఫ్ఐ చర్చిలో పాస్టర్ మార్టిన్ స్టీఫెన్ ఆధ్వర్యంలో యేసు క్రీస్తు వార్షిక సువార్త మహాసభలు ప్రారంభమైనవి. ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు సువార్త మహాసభలు నిర్వహిస్తామని పాస్టర్ స్టీఫెన్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రోజు యేసు ప్రభువు కృప కోసం దైవదాసులు దేశక్షేమం, ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు చేస్తామన్నారు. తవణంపల్లె, ఐరాల మండలాల్లోని క్రైస్తవులు సువార్త మహాసభలకు హాజరుకావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో దైవదాసులు ఉషాకిరణ్, కోదండపాణి పాల్గొన్నారు.

డీఎఫ్ఓ బంగ్లాలో పాము



చిత్తూరు కార్పొరేషన్: డీఎఫ్ఓ భరణి బంగ్లాలో ఉన్న నాగుపామును మంగళవారం రాత్రి సిబ్బంది గుర్తించారు. బంగ్లా పరిసరాల్లో ఉన్న చెత్తచెదారాలను శుభ్రం చేశారు. అయితే రాత్రి గుడిసె(హట్) వద్ద ఉన్న నాగుపామును గుర్తించారు. దాన్ని పట్టుకోవడానికి స్నేక్‌క్యాచర్ కల్‌నాయక్‌ను రప్పించారు. ఆయన చాకచాక్యంగా దానిని పట్టుకొని అడవిలో వదిలేశారు.

పీహెచ్‌సీల్లో సుఖప్రసవం చేస్తాం



గర్భిణులతో మాట్లాడుతున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖప్రసవం చేయనున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ రష్మిత అన్నారు. పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక చొరవ తీసుకొని చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. గర్భంతో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి విపులంగా వివరించారు. అన్ని పరీక్షలను నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సుఖప్రసవం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కుంటుపడుతున్న 104 వైద్య సేవలు



గుడిపాల: ప్రతి గ్రామంలో 104 వైద్యసేవలు అందిస్తామని ఆర్భాటంగా చెప్పుకొంటున్న ప్రభుత్వం దాన్ని ఆచరణలో పెట్టలేదు. మండలంలో గుడిపాల, బొమ్మసముద్రంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నలుగురు డాక్టర్లు ఉండేవారు. ఇందులో ఒక్కో డాక్టర్ ఆస్పత్రిలో ఓపీ చూసుకొంటుండగా మరో డాక్టర్ 104 వాహనంలో వెళ్లి గ్రామాల్లో వైద్యసేవలు అందించేవారు. ప్రస్తుతానికి రెండు ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి ఇద్దరు డాక్టర్లు తమ పలుకుబడితో డెప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో 104 వైద్యసేవలకు వెళ్లే డాక్టర్లు వెళ్లకపోవడంతో వైద్యం కుంటుపడింది. ప్రస్తుతం ఉన్న డాక్టర్లు ఓపీలకే పరిమితమయ్యారు. దీంతో 104 వాహనంలో వైద్యసేవలను ప్రస్తుతం వైద్యులు లేక సిబ్బంది తూతూమంత్రంగా సేవలు అందిస్తున్నారు.

ఐటీఐ పరీక్షలకు దరఖాస్తులు

కార్వేటినగరం: ఐటీఐ పరీక్షలకు ప్రైవేటు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రికల్, ఎక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్ ట్రేడుల్లో ప్రైవేటుగా పరీక్షలకు హాజరయ్యేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలని, ఈ నెల 11వ తేదీ నాటికి 21 ఏళ్లు పూర్తయిన వారు ఏదైనా సంస్థలో మూడేళ్లు పనిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ లోపు తగిన ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కానీ, వివరాలకు 91600 12999, 91609 60999లో కానీ సంప్రదించాలని వెల్లడించారు.

కూలీల బకాయిలు అరకోటి

గ్రామాల్లో వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నీరు గారుతోంది. మండలంలో కూలీలకు చెల్లించాల్సిన బిల్లులు అరకోటి రూపాయలకు పైగా పెండింగులో ఉన్నాయి. రోజూ వారీ మస్టర్లు వేస్తూ, బిల్లులు కంప్యూటర్లో జనరేట్ చేస్తున్నా డబ్బులు మాత్రం కూలీల ఖాతాల్లో పడటం లేదు. మండలంలో వందల మంది ఉపాధి పనులు చేస్తున్నా, నిధుల విడుదల చేయడంలో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో నెలల తరబడి వేతన బకాయిలు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారులు రోజువారి అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తోంది.



కోనాపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- పనిప్రదేశంలో నిలువ నీడ కరువు
- సకాలంలో అందని ఉపాధి వేతనాలు
- వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు

మండల వివరాలు...	
ఉపాధి జాబ్‌కార్డులు	- 7124
శ్రమశక్తి సంఘాలు	- 450
మొత్తం కూలీల సంఖ్య	- 11798
ప్రస్తుతం పనిచేస్తున్నవారు	-1800-2000 వరకు
రోజువారీ గిట్టుబాటు అయ్యే వేతనం	- రూ.220 నుంచి రూ.270వరకు
బకాయిలు సుమారు	- రూ. 50 లక్షల వరకు

యాదమరి: మండలంలో దాదాపు వెయ్యి మందికి పైగా ఉపాధి పనులు చేస్తున్నారు. అయితే ప్రతి కూలీకి కూడా గరిష్ఠంగా రూ.307 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి జిల్లా అధికారులు సూచించారు. మండలంలో మాత్రం సరాసరి రూ.220 నుంచి రూ.270 వరకే వేతనం లభిస్తోంది. ఈ లెక్కన దాదాపు ఒక్కొక్క కూలీకి రూ.పది వేల నుంచి రూ.15 వేల వరకు బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరేసి వ్యక్తులు ఉపాధి పనులకు వెళ్తున్నారు. మండలంలో దాదాపు ఉపాధి కూలీల బకాయిలు రూ.50 లక్షల వరకు పేరుకుపోయాయి. ఇవి కాకుండా ఉపాధి హామీ పథకంలో భాగంగా పలు అభివద్ధి పనులు రోడ్డు పనులు, మినీ గోకులాల నిర్మాణం తదితర పనులు చేపట్టారు. వీటి బకాయిలు దాదాపు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఆర్థిక సంవత్సరం ముగిసినా వేతన బకాయిలు విడుదల చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

నిలువ నీడ కరువు

మండలంలో ఉపాధి కూలీలకు నిలువ నీడ లేక మండుటెండలో విలవిల్లాడుతున్నారు. వేసవి వచ్చినా కనీసం టెంట్లు కూడా లేకపోవడంతో కూలీలకు అవస్థలు తప్పడం లేదు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉపాధి పనులు చేస్తుంటారు. ఆ సమయంలో ఎండ తీవ్రరూపం దాల్చుతోంది. పని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం కోసం కనీసం నీడ కూడా లేకపోవడంతో వడదెబ్బకు గురవుతున్నారు. తాగటానికి మంచినీరు సైతం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేస్తున్న సమయంలో అప్పుడప్పుడు చిన్న చిన్న దెబ్బలు తగులుతుంటాయి. ఆ సమయంలో ప్రాథమిక చికిత్స చేయడానికి అవసరమైన మెడికల్ కిట్లు కూడా ప్రభుత్వం పంపిణీ చేయకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వాపోతున్నారు. వేతనదారులు ఎండ తీవ్రతకు డీహైడ్రేషన్‌కు లోనయితే ఓఆర్ఎస్ ద్రావణాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీల ఆరోగ్య భద్రతపై చర్యలు తీసుకోవాలని వేతనదారులు కోరుతున్నారు.

దీన్నే నమ్ముకుని బతికేటోళ్లం



ఉపాధి పనులకు వెళితే గతంలో వారం వారం డబ్బులొచ్చేది. దీంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. అయితే ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో రోజురోజుకూ కుటుంబపోషణ చాలా కష్టంగా ఉంది. దాదాపు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. వడ్డీకి డబ్బులు తెచ్చుకుని దినసరి అవసరాలను తీర్చుకుంటున్నాం.

–గణేశన్, కోనాపల్లి

నీడ కూడాలేదు



వేతనాలు అందక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నాం. కేవలం కరువు పనులే మాకు దిక్కు. పని ప్రదేశాల్లో కనీసం నీడ కూడా లేక ఇబ్బంది పడుతున్నాం. తాగటానికి నీటి సౌకర్యం లేదు. ప్రస్తుతం ఉదయం నుంచే ఎండలు భగభగమండిపోతున్నాయి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని కూలీలకు ఇస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

–అబ్బిగాన్, కోనాపల్లి

ఇబ్బంది లేకుండా చూస్తాం

ఉపాధి కూలీల బకాయిలు ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటాం. పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ద్రావణాలను అందుబాటులో ఉంచేలా క్షేత్ర సహాయకులకు ఆదేశిస్తాం. కూలీలకు ఇబ్బందుల్లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తాం.

–సంధ్యారాణి, ఏపీఓ,యాదమరి

పల్లకిలో శ్రీరామచంద్రుడు!

చిత్తూరు రూరల్(కాణిపాకం): పల్లకిలో కోదండరాముడు కనువిందు చేస్తూ భక్తులను కటాక్షించారు. చిత్తూరు నగరంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో బుధవారం వార్షిక బ్రహ్మోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. మూలస్థానంలోని శ్రీరామచంద్రునికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. విశేష అలంకరణతో భక్తులకు దర్శన ప్రాప్తి కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తి పల్లకి ఉత్సవంలో కనువిందు చేశారు. మోహినీ అలంకారంలో స్వామి వారు భక్తులను అభయమిచ్చారు. రాత్రి యాళి వాహనంలో ఊరేగారు. భక్తుల నుంచి విశేష పూజలందుకున్నారు.

అంగన్‌వాడీల్లోనే తినాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

గుడిపాల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు భుజించాలని సూపర్‌వైజర్ తోయాద్రాక్షి అన్నారు. మండలంలోని పాపసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. చిరుధాన్యాలతో చేసే ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గోవిందమ్మ, పంచాయతీ కార్యదర్శి కుసుమ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్న ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొంది తరగతులకు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అడ్మిషన్‌లు చేశారు. ఆయన మాట్లాడుతూ బొమ్మసముద్రం కళాశాలలో విశాలమైన తరగతి గదులు, ఫ్యాన్లు, డెస్కులు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం, మంచినీటి వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉచితంగా మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఇవ్వడంతో పాటు ఈ ఏడాది నుంచి తల్లికి వందనం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐదేళ్లుగా జూనియర్ కళాశాలలో నూటికి నూరు ఫలితాలు సాధిస్తూ ఎందరో సాధారణ విద్యార్థులు ఉన్నత విద్యా ఉద్యోగ అవకాశాలు పొందేలా చేయగలిగామన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు వెంటనే ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీలతో ఒకేషనల్ కోర్సుల్లో మెకానికల్ ఆటోమొబైల్ టెక్నీషియన్స్(ఎంఅండ్ఏటీ) సెరికల్చర్ కోర్సులను ఎంపిక చేసుకుని కళాశాలలో చేరాలన్నారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

యాదమరి: భూముల రీసర్వేపై ప్రజలకు అవగాహన కల్పించడానికి స్థానిక తహసీల్దార్ పార్థసారథి పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కోనాపల్లి, పెరియంబాడి గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వే మళ్లీ మొదలైందన్నారు. భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే చేస్తామన్నారు. హద్దుల విషయంలో సరైన స్పష్టత చూపిస్తామన్నారు. ఎక్కడా అవినీతి అక్రమాలకు చోటు లేకుండా సర్వే చేస్తామని చెప్పారు. ప్రజలు రీసర్వేకు సహకరించి తగు లబ్ధి పొందాలని సూచించారు. సర్వేపై రైతులకు, భూ యజమానులకు ఏదేని అనుమానాలు ఉన్నా సంబంధిత వీఆర్వోను, సర్వేయర్‌ని అడిగి తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో పంటలు విషతుల్యం



మాట్లాడుతున్న ఏవో చరిత

యాదమరి: రైతులు రసాయనిక ఎరువులు వాడడం వలన పంటలు విషతుల్యం అవుతున్నాయని మండల వ్యవసాయశాఖ అధికారిణి చరిత పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై వ్యవసాయం, అనుబంధ శాఖల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని చెప్పారు. పంటల సాగుకు ముందు నవధాన్యాలు విత్తనాలు వెదజల్లి పంటలు సాగుచేయాలని చెప్పారు. తద్వారా భూసారం పెరిగి పంటలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయని చెప్పారు. ఖరీఫ్ సీజన్లో ముందస్తుగా ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ కవిత, నీలకంఠ రెడ్డి, యుటీ పార్వతి, రైతుసేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పూతలపట్టు(కాణిపాకం): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించేలా చూడాలని రాష్ట్ర స్థాయి రైతు సాధికార సంస్థకు చెందిన చంద్రశేఖర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం వార్షిక కార్యాచరణ, ప్రణాళికపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. దీనికి మండలంలోని వ్యవసాయ శాఖ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది హాజరయ్యారు. వారు వార్షిక ప్రణాళికలపై సిబ్బందికి వివరించారు. అనంతరం మండల వ్యవసాయశాఖ అధికారిణి మధురవాణి మాట్లాడుతూ రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు వాడడం ద్వారా కూరగాయలు, భూమి కలుషితమై ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. సంఘంలోని ప్రతి మహిళ 365 రోజులు పెరటి తోటలు వేసుకోవాలని మాస్టర్ ట్రైనర్ రాజా ప్రతాప్ తెలియజేశారు.

పకడ్బందీగా పోషణ్ పఖ్వాడ



శ్యామ్ సుగుణ కుమారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలలో పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి పోషణ్ పఖ్వాడ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి అన్నారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని సీడీపీఓ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభమైన పోషన్ పఖ్వాడ ఈనెల 22వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ లక్ష్యం ప్రధానంగా బలహీనంగా, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లలు, కౌమారదశలో ఉన్న బాలికలను గుర్తించి ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టనున్నామని చెప్పారు. ఈ వర్గాల వారి ఆరోగ్య పరిరక్షణకు చేపట్టిన ఈ కార్యక్రమంలో అన్ని శాఖల సమన్వయం అవసరమని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సూపర్‌వైజర్లు బాధ్యతగా తీసుకుని క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేపట్టాలని ఆదేశించామన్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె వివరించారు.

పెంచిన ధరలు తగ్గించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఉపసంహరించకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ తెలిపారు. గాంధీవిగ్రహం వద్ద బుధవారం ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అధికారం కోసం బీజేపీ ప్రభుత్వం పలు హామీలనిచ్చి అమలు చేయడం మరిచిందన్నారు. ధరలు పెంచమని, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, రైతులకు రెట్టింపు ఆదాయం తెస్తామని అనేక హామీలు ఇచ్చారని పేర్కొన్నారు.బసంస్కరణల పేరుతో కరెంటు చార్జీలు పెంచారని గుర్తుచేశారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై మరింత భారం వేస్తున్నారని చెప్పారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎంలు అభ్యంతరం తెలపకపోవడం సరికాదన్నారు. గ్యాస్ ధరను తగ్గించని పక్షంలో ప్రజాసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మణి, విజయకుమార్, జమిలాబీ, కవిత, మోహన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివపార్వతుల కల్యాణం!



కల్యాణోత్సవంలో స్వామి అమ్మవారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పంగుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరం ఈశ్వరగుడి వీధిలోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివకల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. శివాలయ ఆవరణలో పార్వతీ, పరమేశ్వరులను పట్టువస్త్రాలు, భరణాలు, వివిధ రకాల పూలమాలలతో దివ్యమనోహరంగా అలంకరించి, ప్రత్యేక సేవలో తీర్చిదిద్దారు. అలంకార సేవ, శివపార్వతుల కల్యాణ పట్టువస్త్రాలను వేదమంత్ర పఠనాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించిన అర్చకులు కల్యాణ మండపంపై అధిష్ఠింపజేశారు. సకల విఘ్నాధిపతికి తొలి పూజలతో అర్చకస్వాములు కల్యాణతంతు ప్రారంభించారు. ఉభయదారులు కల్యాణ పట్టు వస్త్రాలను అందజేశారు. పరమేశ్వరుడికి యజ్ఞోపవీతధారణ పర్వాలు జరిపిన ఆచార్యులు జీలకర్రబెల్లం, కన్యాదానం తంతు నిర్వహించారు. నిర్ణయించిన సుమూహూర్తంలో పార్వతీదేవి మెడలో పరమేశ్వరుడు మాంగల్యధారణ గావించారు. స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ముత్యాల తలంబ్రాలను అర్చక, వేద పండితులు వేదోక్త పఠనాల నడుమ అలంకరింపజేసే ఆధ్యాత్మిక ఘట్టాలు భక్తుల జయజయ ధ్వానాల నడుమ నేత్రపర్వంగా కొనసాగాయి. ఉదయం భిక్షాండి ఉత్సవం, రాత్రి అశ్వ వాహనంపై స్వామివారు ఊరేగారు.



శివ పార్వతుల కల్యాణమహోత్సవానికి హాజరైన భక్తులు

చిరుధాన్యాలు వినియోగించండి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నిర్మల

ఐరాల: పోషకాహార లోపం నిర్మూలనకు చిరుధాన్యాలను వినియోగించాలని సీడీపీఓ నిర్మల సూచించారు. మండలంలోని పాతపాళ్యం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను నిర్వహించారు. ఆమె చిరుధా న్యాలు విశిష్టత గురించి గర్భిణులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రాగులు, సజ్జలు లాంటి చిరుధాన్యాలు మానవ ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఈ చిరుధాన్యాలు ఉపయోగించడం వల్ల వారి ఆరోగ్యం చాలా బాగుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పాలు, గుడ్లు, బాలామృతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా కేంద్రాల్లో బిడ్డ బరువు, ఎత్తు, వయసుకు తగ్గ బరువు పెరుగుతుందా? లేదా అనే విషయాన్ని ప్రతి తల్లి జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. సెల్‌ఫోన్లు చిన్నారులకు దూరంగా ఉంచాలని, వాడడం వల్ల కలిగే అనర్థాలను తల్లులకు తెలియజేశారు. దీనిలో భాగంగా చిరుధాన్యాలతో కూడిన ఆహారా పదార్థాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, పంచాయతీ కార్యదర్శి ఇందిరా, సచివాలయ మహిళా పోలీసు భార్గవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శేషవాహనంపై సీతారాముల వైభవం



శేషవాహనంపై విహరిస్తున్న సీతాదేవి సమేత శ్రీరామచంద్రుడు

తవణంపల్లె: మండలంలోని అరగొండ కోదండ రామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శేషవాహనంపై సీతాదేవి సమేత శ్రీరామచంద్రుడు విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం అర్చకులు ఆలయంలో సీతారామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూప దీపనైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉభయదారులచే శేషవాహన సేవలను వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, సుగంధపరిమళ పుష్పాలు, పట్టు వస్త్రాలు, పండ్లు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై సీతారాములు కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. 10న గురువారం ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, రాత్రిలో గరుడ వాహన సేవ ఉంటుందని కార్యనిర్వాహకులు తెలిపారు.

గర్భవతులు రక్తహీనతపై దృష్టి పెట్టాలి



గర్భవతులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైరిస్క్ గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 20 మంది గర్భవతులకు రక్త పరీక్షలు, బీపీ, సుగర్‌తోపాటు పలు పరీక్షలు చేయించారు. గర్భవతులు ఆరోగ్యంగా ఉంటేనే గర్భంలో ఉన్న బిడ్డ కూడా ఆరోగ్యంగా పెరుగుతారని సూచించారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు భుజించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పక వాడాలన్నారు. ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవడం వల్ల గర్భంలో ఉన్న బిడ్డ కదలికలు తెస్తుందన్నారు. ఐరన్ మాత్రలు తప్పక వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఆశాకార్యకర్తలు, గర్భవతులు పాల్గొన్నారు.